అదృష్ట జాతకుడు

"ప్రమద"

"నాన్న గూడుపడిపోయిందే ?" అన్న బాబుమాటవిని ఈ లోకంలో పడ్డాను. సముద్రతీరంలో. నాలుగేండ్ల బాబు నా కాళ్లదగ్గిర పిచ్చికగూళ్లుకడుతున్నాడు. బాగ చీకటిపడలేదు. సన్న సన్నగ వాన తుప్పర పడుతున్నది. ఈ సమయంలో బాబుని ఇట్లా తిప్పితే ఊరుకునేదా సావిత్రి ? తన కళ్ళతో, మాటలతో, నవ్వించి కవ్వించే సావిత్రి ఈ నాడు నా ముందునుండే దాటిపోయింది.

సావిత్రిపోయిన 13-వ రోజు. ఆ రోజు సాయంత్రం బాబుని తీసికుని సముద్రతీరాని కెళ్ళాను. నాలుగేండ్లబాబు తనకు తెలిసీ తెలియని ప్రశ్నలతో విసిగిస్తున్నాడు. నాకు అప్రయత్నంగ కళ్ళల్లో నీరు తిరిగినయి.

"నాన్నా! ఎందుకేడుస్తున్నావు ?" బాబు ప్రశ్న.

"ఏడవటంలేదు బాబు" అన్నాను.

"నాన్నా అమ్మ ఎక్కడుంది ?"

నాకేం చెప్పటానికి తోచలేదు. పైకి చూశాను. చంద్రుడు ఉదయించాడు.

"అదిగో, చందమామ దగ్గిరుంది."

"నేను వెడతాను నాన్నా చందమామ దగ్గిరికి."

"ఛ ! మనని రానీరు."

"అమ్మ ఎట్లా వెళ్ళిందే ?"

"అమ్మ, అదృష్ట వంతురాలు." దుఃఖము అపుకోలేక రుమాలు అడ్డంపెట్టుకున్నాను.

"ఇంటికిపోదామురా."

ఇద్దరము లేచి ఇంటికి వెళ్లిపోయాము. బాబుని సంధ్యచేతికిచ్చి వాకిట్లో అరుగుమీద కూర్చున్నాను.

2

"అన్నానికి రా బావా ?" అంది సంధ్య

వెనక్కి తిరిగిచూశాను. సంధ్యగడప మీద నిలుచుంది.

"రాలేనమ్మా ఆకలిపోయింది."

"ఆకలి ఎందుకులేదు బావా ? దిగులు పడి చేసేదేమిటి ?"

"ఏమీచెయ్యలేము. సరేగాని, అన్నము తిని నిద్రపోయాడా బాబు" అన్నాను.

"ఉ. అన్నయ్యా, నాన్న నీకోసరము కనిపెట్టుకు కూర్చున్నారు."

'గంట ఎనిమిదయింది. ఇక తప్పదని భోజనానికి లేచాను.

పడుకున్నానేగాని నిద్రపట్టడంలేదు. ఆలోచనలు పరంపరలుగ వస్తున్నాయి. నేను సావిత్రి క్లాసుమేట్సు. నేను మెడికల్ కాలేజిలో ఫైనలియర్ చదువుతున్నప్పుడు ఆమె ఫస్టియరు. మా ప్రేమ ఎట్లా ఏర్పడిందో తెలీదు.

నేను, సావిత్రి పెళ్లిచేసుకోవటము మా ఇంట్లోవాళ్లెవరు ఒప్పుకోలేదు. కాని నా పట్టుదలవలన ఒప్పుకోక తప్పలేదు.

సావిత్రిలో ఎవరు వేలుపెట్టి చెడ్డ గుణము చూపలేదు. ఆ ఊళ్ళో అందరితో తలలో నాలికగ ఉండేది. నాకో సంఘటన అకస్మాత్తుగా గుర్తుకొచ్చింది.

మా చెల్లెలు కూతురు పుట్టినరోజు నాడు సావిత్రి తనే అంతపని చేసింది. "నాకొడుకుకు మీ కూతుర్నియ్యవమ్మా" అని మా చెల్లెల్ని సావిత్రి అందిట. "మాకేం దొరక్కనా" అందిట మా చెలెలు. దాంతో సావిత్రికి కోపమొచ్చి మా ఇంటిగడప తొక్కలేదు. సావిత్రి పోయినరోజున మాఅమ్మ మాత్రంవచ్చి వెళ్లిపోయింది. కాని మా మామయ్య మాత్రం నాకు అండగా ఉన్నాడు.

3

ఆ రాత్రి వాకిట్లో నేను మా మామయ్య మాట్లాడుకుంటున్నాము.

"సంధ్యపెళ్లి తేలలేదురా?" అన్నాడు మామయ్య.

"అవుతుందిలే" అన్నాను.

"పోనీ నువ్వు చేసికోరాదూ."

"నేనా ... మామయ్యా ... ?"

"అవునురా. నిన్నే సంధ్యచేసికుంటానంటున్నది. పైగా బాబుని జాగ్రత్తగ చూస్తానంది. మాట్లాడక ఒప్పుకో."

"ఆలోచించనీ" అన్నాను.

ఎంత ఆలోచించినా చేసుకోటమే ఉత్తమంగా కనపడ్డది. సంధ్యకి నాకు వారంఉంది పెళ్లి.

మా ఇంటికివచ్చిన చుట్టాలు ఒకరోజైన సావిత్రి ఉండగావస్తే ఎంత బాగుండేది.

ఆమెతో ఆ రాత్రే చెప్పాను. "నీవు బాబుని సరిగా చూస్తావా? నీవు, సిగ్గుపడి లాభంలేదు. ఇది భవిష్యత్తుకు సంబంధించింది. చూస్తానంటెసరే లేకుంటే మానేస్తాను" అన్నాను.

"చూస్తాను", అంది ఆమె.

నాకు సంతోషమయింది కాని బాబుని గూర్చి ఒక్కప్పుడు భయం మాత్రం పోలేదు.

మా జీవితము ఒడుదుడుకులు లేకుండా సాగిపోతూంది. కొన్నాళ్లు గడిచినయి. సంధ్య మాతృదేవి కాబోతున్నదని తెలిసిందినాకు. బాబు విషయమై కొంచెము భయపడ్డాను. కాని సంధ్య అటువంటిది కాదని బాబును జాగ్రత్తగ చూస్తుందని సమాధానపడ్డాను.

మరో కొత్త కాలెండర్లు వచ్చినయి. బాబుకు నాలుగేళ్లు జరుగుతున్నయి. చాల మంది బడికి పంపమని ఇచ్చిన సలహాను నిర్లక్ష్యపెట్టలేదు. ఈలోగ సంధ్యమాతృదేవి అయింది. నా మనస్సులో ఇంకా దిగులుగానేఉంది, బాబు భవిష్యత్తు గురించి. ఒంటరిగ సావిత్రి దగ్గరకొచ్చి కళ్ళ నీళ్ళు కార్చేవాణ్ణి. కాని ఫోటోలో ఉన్నసావిత్రి నామాట వినిపించుకునేది కాదు. అసలు ఈ పెళ్లి ఎందుకు చేసికున్నాను ?

రాధబాబు సంధ్యకు అన్నయ్య అవుతాడు. అతను ఒరోజు మా ఇంటికొచ్చినపుడు బాబు విషయము చెప్పేను. ఇందుకు కారణము లేకపోలేదు. రాధబాబు నేను, ఒకప్పుడు ఒకకంచంలోతిని ఒకమంచంలో పడుకున్నాము. రాధబాబు నేను చాల దగ్గరసన్నిహితులము అందుకే చెప్పేను.

రాధబాబు చివరి సారిగ ఆలోచించి సలహా ఇచ్చాడు.

"పోని అనాధశరణాలయంలోచేర్పిస్తే"

ఈ మాట అనీ అనకముందే రాధబాబు చెంపమీద నాకుడిచెయ్యి తీవ్రముగ పనిచేసింది. రాధబాబు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు. రాధబాబు అన్నట్టు వాడుదిక్కు-లేనివాడా ?

బాబుకి ఇప్పుడు ఎనిమిదేళ్లు. సంధ్య కొడుకు శ్రీధర్ కి నాలుగేళ్లు జరుగుతున్నాయి. ఓరోజు హాస్పటల్ నుంచి వచ్చాను. ఇంట్లో ఏవోమాటలు వినపడుతున్నయి. వాకిట్లో ఆగేను. "వెధవ! నీకు బడికి జీతముకూడకావాలి! పైగా పుస్తకాలుకూడ! ఎవరిస్తారు నీకు ?" అంటున్నది సంధ్య.

"పిన్ని ఇవ్వాళ కట్టకపోతే బళ్ళోంచి వెళ్ళకొడతారు పిన్ని" అన్న బాబు స్వరంలో దుఃఖము పూర్తిగ ఉంది.

"ఇప్పుడు ఇక్కడనుంచి కదలకపోతే నేను వెళ్ళగొడుతాను." అంది సంధ్య.

"వెళ్ళగొట్టు చూస్తాను" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాను. సంధ్యనన్ను చూసి నిశ్చేష్టితురాలయింది.

"ఏం - అలా అయిపోతావు? మర్యాదగ ఉంటే ఉండు-పోతే పో! వాడినేమన్నా అంటే నేఊరుకోను" అన్నాను కోపంగా! సంధ్యమాట్లాడలేదు. విసురుగ కొడుకును తీసుకుని వెళ్ళిపోయింది.

"నాన్నా! నాన్నా!" అంటూ బాబు వచ్చాడు.

"ఏం బాబు" అన్నాను.

"పొద్దున్న పిన్ని ఇడ్లీ తెప్పిచ్చింది నాన్నా! నాకు పెట్టలేదు" వెంటనే ఇంట్లోకి వెళ్లాను. వంటఇంట్లో సంధ్య పలహారము చేస్తున్నది. "వాడికెందుకు ఇడ్లీ పెట్టలేదు?" అన్నాను. సంధ్య బాబువైపు కొరకొర చూసింది.

"తెప్పించుకుంటే గదూ పెట్టడానికి!"

"బాబు అబధ్దమాడుతాడా!"

"నిజమే! ఎట్లయినా మీకు మా వాళ్లు మీ ..."

సంధ్య చెంపలు తడుముకుంది.

"సరిగ ఉంటే ఉండు - పోతేపో!" కోపంగా గట్టిగ అరిచాను.

ఆరాత్రి మాకు అన్నము లేదు. బాబుకి ఏవో హోటలునుంచి తెచ్చి పెట్టాను. నేను బాబుపక్కనే పడుకున్నాను. రాత్రినిద్రలో వాడేదో అస్పష్టంగ కలవరిస్తున్నాడు.

బాబు ఇప్పుడు నాలుగవ తరగతి పేసయినాడు. వాడు 5-వ తరగతిలోకి ప్రవేశించాడు. శ్రీధర్‌నుకూడ మొదటి క్లాసులో చేర్పించాను. మొన్న రామయ్య మాష్టారు కనిపించి "మీ బాబు, ఫస్టులో పేసవుతాడండి" అన్నప్పుడు నాకానందము అవధిదాటింది. రోజూ ఏదో ఒక రిపోర్టు బాబునుంచి వస్తునే ఉంది. ఫలితంగ సంధ్యని నాలుగు అఱుపులు అరవటం సంధ్య కళ్లనీళ్లు పెట్టుకోవటం మామూలై పోయింది.

హాస్పిటల్‌నుంచి వచ్చేసరికి బాబు కళ్లు ఎఱ్ఱగ వాచిఉన్నాయి. మొగమంత కంది పోయింది. రెండు చేతులు చెంపలకు ఆనించుకుని సావిత్రి ఫోటోముందు కూర్చుని ఉన్నాడు. నిశ్శబ్దంగ లోపలికి ప్రవేశించాను.

"అమ్మా! పిన్ని కొట్టింది."

సమాధానంరాలేదు.

"నేనేం చెయ్యలే అమ్మా! ఉరికినే, ఉప్మాపెట్టమన్నా."

మళ్లీ సమాధానం లేదు.

"ఏం అమ్మా, ఉప్మాతినకూడదా నేను" జాలిగ ప్రశ్నిస్తున్నాడు తన తల్లిని.

"తినచ్చు బాబు! తినచ్చు" అంటూ ఆత్రంగ బాబుని కావలించుకున్నాను.

"నీ బ్రతుకిలా అవుతుందని అనుకో లేదు బాబు" అన్నాను.

"ఎప్పుడూ వాడితో నేనా లోకం ! ఉప్మాతిందురు రండి" సంధ్య గదిలోకి వచ్చింది.

"ఛీ! నోర్ముయ్, నీకు బుద్ధిలేదు! నీలో జాలిలేదు, ప్రేమలేదు. స్వార్ధం! స్వార్ధంతప్ప మరొకటిలేదు. ఫో! తక్షణం నా ఇంట్లోంచి ఫో! ఇక ఈ ఇంట్లో నీకు స్థానములేదు. నీవు నీ కొడుకు ఊరే గండి!" కోపంగా అరిచాను.

సంధ్య "సరే పోతున్నాను. మీరు తండ్రి, ఆయన కొడుకు. ఇంకేం" అంది.

సంధ్య వెళ్లిపోయింది. సంధ్యతో పాటు శ్రీధర్ కూడ వెళ్లిపోయాడు. నేను రిటైరైపోయినాను. ఏటా నెలకు వంద రూపాయలు పింఛను వస్తుంది. దాంతో నేను బాబు సరిపెట్టుకోగలము. బాబు ఇప్పుడు రెండవఫారము చదువుతున్నాడు. సంధ్యవెళ్లి ఇప్పటికి రెండేళ్లు. ఇంతవరకు సంధ్య సంగతి తెలియలేదు. ఓ రోజు అన్నంవండి కూర్చున్నాను. ఇంకా బాబు బడినుంచిరాలేదు. సంధ్య దగ్గరనుంచి ఉత్తరము వచ్చింది.

"శ్రీ వారికి;

ఇదే నేవ్రాస్తున్న మొదటి చివరి ఉత్తరము. శ్రీధరుడు పూర్తిగ చెడి పోయినాడు. ఇందుకు కారణము "నేనే" నని అంతరాత్మ బోధిస్తున్నది. నేను మద్రాసులో ఉంటున్నాను. స్కూలు ఫైనలు జ్ఞానంతో ఓ చిన్న స్కూలు పెట్టుకున్నాను. కాని అందులోకి పిల్లలు రాను రాను రావటంలేదు. తర్వాత మరో మిడిల్ స్కూల్లో చేరాను. నా జీవితము అంతా పూర్తిగ పాడయింది. శ్రీధరుడికి పూర్తిగ చెడ్డఅలవాట్లు పట్టుబడ్డయి. చి॥ బాబుని మీరయినా శ్రద్ధగ చూస్తారని ఆశిస్తాను.

మీ "సంధ్య"

నా కళ్లల్లోంచి రెండు కన్నీటి బిందువులు రాలినయి. "నాన్నా నాన్నా!" అన్న బాబు మాటవిని ఈ లోకంలో కొచ్చాను.

బాబు మధ్యాహ్నం బడికివెళ్లాడు. రేపటినుండి వాడికి శలవలు. రేపె మద్రాసు వెళ్దామనుకున్నాను. పెట్టె, బెడ్డింగు ఆపూటే సర్దేశాను. బాబు రాగానే మద్రాసు వెళ్తున్నామని చెప్పాను. వాడు సంతోషంతో "మద్రాసు, మద్రాస"ని గంతులు వేస్తున్నాడు.

మద్రాసు నగరంలో ఇంకా తూర్పు తెల్లవారలేదు. ఇంజనుమోత నగరమంత వ్యాపిస్తున్నది. కాఫీత్రాగి టాక్సీలో ఓ హోటలు కెళ్ళాము. రూము తీసికుని, పెట్టె, బెడ్డింగు గదిలోపెట్టి నేను బాబు

మిడిల్‌స్కూలువైపు నడక సాగించాము. మిడిల్‌స్కూలు అష్టకష్టాలుపడి చేరుకున్నాము. కాని స్కూలుకు శెలవలు అనగానే నాకు నిరాశ అయింది. అక్కడున్న ప్యూనుని పిలిచి "ఇక్కడ సంధ్యాదేవి అనే ఆవిడ టీచరుగ పనిచేస్తుంది తెలుసా" అన్నాను.

"తెలీకేం బాబు తెలుసు, ఆవిడని ఎరుగనివాళ్లున్నారా?" అన్నాడు.

"ఏం? ఆవిడంత గొప్ప మనిషా."

"కాదు బాబు, మీకు తెలుస్తుందిగ. ఎందుకు చెడిపోతారు బాబు మీరుకూడ. చూస్తూ చూస్తూ మిమ్మల్ని వేశ్య ఇంటికి ఎలా తీసికుపోను;"

సంధ్య వేశ్యా! నామతిపోయింది.

"అదే బాబు, వస్తాబాబు చెడిపోకండి" అన్నాడు. ప్యూను వెళ్లిపోయాడు.

చిన్నఇల్లు. వాకిట్లో ఏవో మొక్కలు. పెంకుటిల్లు అది. బయటనున్న కిటికీలోంచి చూచాను.

"సంధ్య!" పిలిచాను.

తలుపుతీసింది.

"ఎందుకొచ్చారు? ఇక్కడున్నట్లు ఎలా తెలుసూ?" అంది.

"తెలుసులే, రాపోదాం!" అన్నాను.

"రాను — రాలేను!" సంధ్య పెదవులుతడబడ్డాయి.

"మనింటికి పోదాంరా సంధ్యా?" అన్నాను.

"మనిల్లు మన - అనేమాటకు అర్థం లేదు. ఇక్కడనేను పడుపువృత్తితోనే జీవిస్తున్నాను. నాకాధారంలేదు. పదేళ్ల శ్రీధరుడుకూడ బీడీలు, సిగరెట్లు, తాగుతున్నాడు. వాడు పూర్తిగ చెడ్డాడు. బాగుపడతాడని ఆశ 'ఏనాడో అంతరించిపోయింది. మీరైనా బాబుని శ్రద్ధగ చూడండి." సంధ్య ఆవేశంగ ఆగింది.

"రాబాబు" అందిసంధ్య.

బాబు నా వైపు ప్రశ్నార్థకంగచూశాడు.

"పోబాబు, పిన్ని దగ్గరకెళ్లు!"

"నన్నుక్షమించు బాబు! నేనునీకెంతో అపకారము చేశాను. ఈ నాటికి తెలిసివచ్చింది. మీనాన్నకి తగినకొడుకనిపించుకో! ఏనాటికైనా నువ్వే మీ నాన్నను పోషించేది. నా తప్పులన్నీ క్షమించు! నన్ను హృదయపూర్వకంగా క్షమించు. ఎప్పుడయినా నేను గుర్తుకొస్తే నీ గుండెల్లోంచి రెండుకన్నీటిబొట్లు విడువు బాబు"

"ఊరుకో సంధ్య" ఓదార్పుగ అన్నాడు.

"నా అనేవారు దూరమయినారు.

మీరైన చివరిసారిగ వచ్చారు.'' సంధ్య దుఃఖంగ మాట్లాడుతోంది.

''అయితే రా - ?''

''రాను''

బాబు, నేను బయలుదేరాము.''ఉండు బాబు'' అంటూనే సంధ్య వంట ఇంటి లోపలినుండి ఓ అయిదు రూపాయిలనోటు తెచ్చి, ''బాబు, మీ అమ్మను క్షమిస్తావు గదూ?'' అందిజాలిగ. బాబుకర్థముకా లేదు. నా వైపు వింతగచూశాడు.

మావూరు తిరిగి వచ్చేశాము. బాబు బి. ఎ. పేసయ్యాడు. మా ఊళ్ళో నే ఇనస్పెక్టర్‌గ జాయిన్ అయ్యాడు. ఆరోజు గబగబ పరుగెత్తుకునివచ్చి,

''నాన్నా, చూశావా? ఎన్నో హత్యలు దోపిడిలు చేసిన శ్రీధర్ అనేగజదొంగని పట్టుకున్నాను. ఇంక ప్రమోషన్ వస్తుంది'' అన్నాడు సంతోషంగ.

''పద - నేను అతడ్ని చూడాలి.'' అన్నాను. ఇద్దరము స్టేషనుకెళ్లాము.

మాసిన, చినిగిన చొక్కా, బాగచినిగి అతుకులేసిన పొడుగులాగు సంకెళ్లు చేతులకి, నలుగురు పోలీసులు కాపలా ఉన్నారు.

''నీ పేరూ''

''శ్రీధర్'' అన్నాడు.

''మీ అయ్యపేరు''

''తెలవదు బాబు''

''మీ తల్లి ఉందా!''

''ఆ - సంధ్య.''

శ్రీధర్‌కి ఉరిశిక్ష పడింది. నేనేం చెయ్యను! పుట్టగానే ''అదృష్టజాతకుడి విరా'' అన్న మాతాతయ్య మాటలు నాకిప్పటికి జ్ఞప్తికివస్తుంటయి.

పాత్రుడుగారి

బాలసంజీవిని (Regd)

పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును

డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,

19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354

కుంభకోణము బ్రాంచి: 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.

అన్ని మందుల షాపులలోను దొరకును.